క్లుప్తంగా

శివస్వాముల సన్నిధానం ప్రారంభం



సన్నిధానం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయకృష్ణ, స్వాములు

పాలకొండ: పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ సమీపంలో నిర్మించిన శివ స్వాముల సన్నిధానాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం ప్రారంభించారు. పల్లా కొండలరావు సుమారు ఏడు లక్షల రూపాయల విరాళంగా అందజేసి తన తల్లిదండ్రుల పేరిట సన్నిధానం నిర్మించారు. ప్రారంభోత్సవం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

భారీ వర్షం



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4:30 గంటల వరకు ఎడతెరిలేకుండా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లు, వీధుల్లో వరదనీరు ప్రవహించింది. ఎన్నాళ్ల నుంచో వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రస్తుతం పడిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. పొట్ట దశలోని వరి పంటకు ఈ నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నందీశ్వరుడికి దీపార్చన



దేవరపేటలో భక్తుల పూజలు అందుకుంటున్న నందీశ్వరుడు

పాలకొండ రూరల్: పట్టణంలోని దేవరపేట, మేదరవీధి, వీవర్స్‌కాలనీతో పాటు అంపిలి, తుమరాడ గ్రామాల్లో నందన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవరపేటలో నందెన్నకు శనివారం దీపార్చన చేపట్టారు. అలాగే ఇతర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గౌరీ సమేత పరమశివుడు నంది వాహనదారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రైతు ఉత్పత్తిదారుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న రైతు ఉత్పత్తిదారుల నూతన కార్యవర్గ సభ్యులు

వీరఘట్టం: మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెలుగు ఏపీఎం కె.రాము తెలిపారు. అధ్యక్షుడిగా కరణం చిన్నంనాయుడు, ఉపాధ్యక్షుడిగా చందక సత్తిబాబుతో పాటు మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ఎఫ్‌పీఓ సీసీ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నసమారాధన కార్యక్రమం శనివారం చేపట్టారు. స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులంతా అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం పద్మావతి సమేత స్వామి వారికి సుప్రభాతసేవ, మంగళాశాసనం పూజలు చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించగా, స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

కనుమరుగవుతున్న నల్లజీడి..

- కొండపోడుతో పోయిన చెట్లు
- ఆదాయం కోల్పోయిన గిరిజన రైతులు
- జీసీసీ ప్రకటించిన మద్దతు ధర కిలో రూ.18



గతంలో గిరిజనులు సేకరించిన నల్లజీడి పిక్కలు (ఫైల్)

సీతంపేట:

ఒకప్పుడు కొండకోనల్లో ఈ సీజన్‌లో విస్తృతంగా లభించే నల్లజీడి పిక్కలు ఈ ఏడాది కనుమరుగయ్యాయి. దీంతో గిరిజనుల ప్రధాన ఆదాయ వనరుకు నష్టమేర్పడింది. చాలాచోట్ల కొండపోడు వ్యవసాయం ఎక్కువగా చేయడంతో ఈ చెట్లు నరికివేతకు గురయ్యాయి. గడచిన నాలుగైదేళ్లలో ప్రతి సంవత్సరం ఎక్కడ చూసినా ఈ సీజన్‌లో వారపు సంతల్లో గిరిజన రైతులు వీటిని విక్రయించేవారు. సీతంపేట ఏజెన్సీలో కొండపోడులో పండే నల్లజీడి పిక్కలకు ముంబైలో డిమాండ్ ఉంది. ఈ నల్లజీడిని రంగుల తయారీలో ఉపయోగిస్తారు. గిరిజన సహకార సంస్థ వీటిని విస్తృతంగా కొనుగోలు చేసి, క్వింటాళ్ల లెక్కన వివిధ కంపెనీలకు విక్రయించేది. దీంతో ఇటు జీసీసీకి, గిరిజనులకు ఆదాయం వచ్చేది. సీతంపేటలో సోమవారం.. మర్రిపాడులో బుధవారం.. దోనుబాయిలో గురువారం.. పొల్ల, కుశిమిల్లో శనివారం జరిగే వారపు సంతల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ జీసీసీ సేల్స్‌మన్లు పిక్కలు కొనుగోలు చేసేవారు. అయితే దిగుబడి తగ్గడం, అరకొరగా మార్కెట్‌కు వచ్చిన నల్లజీడిని మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కిలో రూ.15 వరకు కొనుగోలు చేసి మమ అనిపిస్తున్నారు. గతంలో జీసీసీ కిలో రూ.15 మద్దతు ధరతో కొనుగోలు చేసేది. ఈ ఏడాది మద్దతు ధర 18 రూపాయలుగా ప్రకటించింది. దిగుబడి తగ్గడం, వారపు సంతలకు గిరిజనులు పిక్కలు తీసుకురాకపోవడంతో జీసీసీ కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది.

నల్లజీడి ఉపయోగమేమిటంటే...

ముంబైలో రంగుల తయారీ కంపెనీలు నల్లజీడిని ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాయి. నల్లజీడి పిక్కల మధ్యలో ఉన్న పలుకులను కేరళ వాసులు ఇష్టంటా తింటారు. నల్లజీడి నుంచి లోపల పిక్కలను వేరు చేసి కొన్ని సందర్భాల్లో అరకేజీ పలుకులను రూ.200కు గిరిజనులు విక్రయించేవారు. అయితే వీటి లోపల పలుకులను తీయడం చాలా కష్టమైన పని. పలుకులు తీసేక్రమంలో జీడి తగిలి దురదలు వస్తాయి. అందుకే నేరుగా పిక్కలను విక్రయిస్తుంటారు. అయితే ఈ ఏడాది పోడు వ్యవసాయంలో భాగంగా చాలా వరకు చెట్లు కోల్పోయామని గిరిజనులు చెబుతున్నారు.

కొనుగోలు చేస్తాం..



గిరిజన రైతులు నల్లజీడి పిక్కలు తీసుకువస్తే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. గిరిజనుల నుంచి కొనుగోలు చేయాల్సిన అన్ని రకాల ఉత్పత్తులకు జీసీసీ మార్కెట్ ధరలను నిర్ణయించింది. నిర్ణీత ధరల ప్రకారమే కొనుగోలు చేస్తాం.

–దాసరి కృష్ణ, జీసీసీ మేనేజర్

దిగుబడి లేదు..

నల్లజీడితో పాటు మిగతా అటవీ ఉత్పత్తుల దిగుబడి కూడా ఈ ఏడాది పెద్దగా లేదు. ఒక వేళ కష్టపడి సేకరించినా మద్దతు ధరలు లేవు. గతంలో నల్లజీడి ఎక్కువగా పండేది. మంచి లాభాలు చూసేవాళ్లం. ఈ సంవత్సరం ఆ పంట కూడా లేదు.

– ఎస్.మోజేషు, జోగినాయుడుగూడ

నష్టాలు చవిచూశాం..



ఈ ఏడాది అన్ని పంటల్లోనూ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. నల్లజీడి ఎక్కడ వెతికినా కనిపించడం లేదు. కొండకోనల్లో తిరిగి సేకరిద్దామన్నా అసలు చెట్లే కనిపించడం లేదు.

– ఎస్.తేజ, అక్కన్నగూడ

కస్టోడియన్‌ల నియామకం



వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న తహసీల్దారు బాల

గరుగుబిల్లి: ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించి, ఏర్పాటు చేసిన పీపీసీ కేంద్రాలకు కస్టోడియన్‌లను నియమించినట్లు తహసీల్దారు పి.బాల తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో కస్టోడియన్లుగా నియమితులైన వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశమైన తహసీల్దారు.. ప్రభుత్వం గుర్తించిన రైస్‌మిల్లుల వద్ద నుంచి పీపీసీ కేంద్రాలకు గోనె సంచులను తరలించే బాధ్యత కస్టోడియన్ అధికారులదేనన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌డీటీ సుందరరావు, సీనియర్ సహాయకులు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్షర బ్రహ్మ మందిరం ప్రారంభం

భామిని: మండలంలోని సతివాడ సమీపంలో నూకాలమ్మగూడ వద్ద నిర్మించిన అక్షర బ్రహ్మ మందిరాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఆదివాసీ గిరిజనులు అక్షరాలనే విగ్రహాలుగా కొలుస్తుంటారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరధర గొమాంగో చేతుల మీదుగా మందిరాన్ని ప్రారంభిస్తామని అక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం జిల్లా కోఆర్డినేటర్ సవర కరువయ్య తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రా – ఒడిశా సవర భాషోద్యమకారులు హజరు కానున్నారన్నారు. మందిరానికి ముందు సింహద్వారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ఆదివారం నుంచి చేపట్టనున్న సోషల్ ఆడిట్‌కు సహకరించాలని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏపీవో బాబూరావుతో కలిసి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలతో శనివారం సమావేశమైన ఆయన.. పనుల్లోని పారదర్శకతకే ఆడిట్ చేయడం జరుగుతోందని, ప్రజాప్రతినిధులంతా ఆడిట్ బృందానికి అవసరమైన సమాచారం అందివ్వాలన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.25,06,91,552లు, పంచాయతీరాజ్ ద్వారా రూ.1,29,92,139లు, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.5,63,58,139లతో మొత్తం 3,208 పనులను గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో చేపట్టడం జరిగిందన్నారు. ఆయా పనుల తనిఖీలకు, అనంతరం ఏర్పాటు చేసే గ్రామసభలకు తోడ్పడాలన్నారు. సమావేశంలో ఉపాధి హామీ పథకం జేఈ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ



విక్రమపురంలో మినీ గోకులం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కూటమి నాయకులు

వీరఘట్టం: మండలంలోని బిటివాడ, విక్రమపురం గ్రామాల్లో మినీ గోకులాల నిర్మాణాలకు కూటమి నాయకులు శనివారం భూమిపూజ చేశారు. ఒక్కో యూనిట్ రూ. 2.30 లక్షలతో నిర్మించనున్నట్లు ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు. మండల వ్యాప్తంగా 25 మినీ గోకులాల యూనిట్ల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాచర్ల వెంకటరమణ, అనిల్, నందీశ్వరరావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

- ఈఓపీఆర్‌డీ కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ కృష్ణారావు

పాలకొండ: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్‌డి కృష్ణారావు తెలిపారు. మండలంలోని కొండాపురంలో సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని తెలిపారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ ఉన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ద్వారానే గిరిజనులకు న్యాయం



ఆదివాసీ జేఏసీ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్:

ప్రత్యేక డీఎస్సీ ద్వారానే గిరిజనులకు న్యాయం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ నిమ్మక జయరాజు, ఆదివాసీ జేఏసీ చైర్మన్ కొండగొర్రి ధర్మారావు కోరారు. స్థానిక గిరిజన భవనంలో మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు అధ్యక్షతన జేఏసీ జిల్లా శాఖ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులు అరకు, కురుపాం నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఎస్టీలకు ప్రత్యేక ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు నవంబరులో విడుదల చేయనున్న డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌లో షెడ్యూల్ తెగలకు సంబంధించి పోస్టులను ప్రత్యేకంగా పేర్కొనాలని కోరారు. ఇటీవల పీసా గ్రామ సభల ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసి ఎన్నికలు వాయిదా వేయడం వెనుక ఉద్దేశం ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే పీసా ఎన్నికలు నిర్వహించి గిరిజనుల స్వయంపాలనకు సంబంధించి నిర్ణయం తీసుకోవాలన్నారు. త్వరలో అన్ని నియోజకవర్గాల ఎస్టీ శాసనసభ సభ్యులకు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులకు ఈ మేరకు వినతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే ప్రతీ నియోజకవర్గం పరిధిలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో విశ్రాంత ఎస్‌డీసీ ఆరిక ధర్మారావు, ఆదివాసీ నాయకులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, వాసు, ఇంటికుప్పల రామకృష్ణ, ఎ.అన్నాజీ, రోబా లోవరాజు, కె.రాఘవేంద్ర, నిమ్మక అన్నారావు, మండల గిరిధరరావు, మల్లయ్య, తాడంగి సత్యం, త్రినాథ, తిరుపతి, నరేష్, పి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక



గుమ్మలక్ష్మీపురం: ఎంపికైన విద్యార్థులతో పీడీ మాధవరావు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి చెస్(చదరంగం), హాకీ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు)కు చెందిన ఆరిక నవీన్, మీనక చింటు, ఆరిక శివలు పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారని పీడీ(ఫిజికల్ డైరెక్టర్) నిమ్మక మాధవరావు శనివారం తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో పాల్గొన్న వారు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో ఆరిక శివ, అనకాపల్లి జిల్లాలో జరిగే పోటీల్లో అండర్-14 విభాగంలో ఆరిక నవీన్, మీనక చింటులు పాల్గొంటారన్నారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పసుపురెడ్డి నవీన్, గేదెల శ్రీకాంత్‌లు రాష్ట్ర స్థాయి చదరంగం(చెస్) పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ శనివారం తెలిపారు. ఇటీవల పార్వతీపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు అండర్-14, అండర్-17 విభాగాల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

మండల సమాఖ్య ఎన్నిక



కమిటీ సభ్యులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీఎం చక్రపాణి

భామిని: మండల మహిళా సమాఖ్య కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం మీసాల చక్రపాణి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో 30 గ్రామైక్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా బిడ్డిక హేమలత (భామిని), ఉపాధ్యక్షురాలిగా సీహెచ్.శశి (లివిరి), కార్యదర్శిగా బి.భవానీ (ఘనసర), జాయింట్ సెక్రటరీగా తిడ్డిమి పార్వతి (నేరడి–బి), కోశాధికారిగా పడాల విజయలక్ష్మి (బాలేరు)లను ఎన్నుకొన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వీఓ కమిటీ సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్పవని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. పాలకొండ పట్టణంలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా మహ సభలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకపాలన సాగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసగించిందని వివరించారు. ఇటువంటి ప్రభుత్వాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బా రవణమ్మ మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు ఐకమత్యంతో పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, జిల్లా కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

పక్కాగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

- డీఐఓ నారాయణ



భామిని పీహెచ్‌సీలో రోగిని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ నారాయణ

భామిని: ఆస్పత్రికి వచ్చే వారి రోగం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కచ్చితత్వంతో నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఐఓ ఎం.నారాయణ అన్నారు. మండలంలోని బత్తిలి, భామిని పీహెచ్‌సీలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు సంబంధించి రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. సీబీసీ ఎనలైజర్ ద్వారా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినట్లు గుర్తిస్తే వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుపుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే రోగులతో మాట్లాడారు. అనంతరం భామిని కేజీబీవీని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. బత్తిలి, భామిని వైద్యాధికారులు దామోదరరావు, సంతోషిలక్ష్మి, ఎస్‌ఓలు జయగౌడో, సరస్వతి, గౌరీశ్వరి, ఎస్‌ఓ శారదలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభ



లుంబూరులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పల్లె ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఇటువంటి గ్రామసభలను ప్రజలు వినియోగించుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. మండలంలోని లుంబూరు పంచాయతీ కేంద్రం వద్ద మండల రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంజీవి

గుమ్మలక్ష్మీపురం: జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడేందుకు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని చేరుకోవాలని జాయ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బి.ఎస్.కె.సంజీవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్(జీవిత మార్గదర్శకత్వం)పై శనివారం అవగాహన కల్పించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కో–ఆర్డినేటర్ స్వరూప ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ టి.శ్రీవరం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన.. ఎవరి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంటుందని, మనకు బంగారు భవిష్యత్ కావాలంటే మనకు మనమే ఆ దిశగా ఆలోచన చేయాలని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా నడుచుకుంటే ఎంతటి విజయమైనా సాధ్యమేనన్నారు. విద్యార్థులంతా తమ ఉజ్వల భవిష్యత్‌కు ఇప్పటినుంచే లక్ష్యాలు రూపొందించుకుని, వాటిని చేరుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, కో–ఆర్డినేటర్లు కల్పన, తులసి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి..

- ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు సక్రమంగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.